# కాంగ్రెస్ విజయం

- నాలుగు చోట్ల హస్తం విజయం
- రెండు చోట్ల బీఆర్ఎస్..
- మూడు చోట్ల బీజేపీ గెలుపు
- నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్
- ఉమ్మడి జిల్లాలో మిశ్రమ ఫలితాలు
- ఆరుగురు కొత్తవారే..



ఎన్నికల అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ


కౌంటింగ్ కేంద్రం వద్ద బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో మిశ్రమ ఫలితాలు వెలువడ్డాయి. మొత్తం తొమ్మిది నియోజకవర్గాల్లో మూడు పార్టీలకు ప్రాతినిధ్యం దక్కినట్లు అయ్యింది. మొన్నటి వరకు తొమ్మిది నియోజకవర్గాలకు తొమ్మిది స్థానాల్లోనూ బీఆర్ఎస్ ప్రాతినిధ్యం ఉండగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం మూడు పార్టీలకు విజయం దక్కింది. భారత రాష్ట్ర సమితికి రెండు చోట్ల, భారతీయ జనతా పార్టీకి మూడు చోట్ల, కాంగ్రెస్ పార్టీకి నాలుగు చోట్ల విజయం వరించింది. ఆది నుంచి ప్రజల్లో ఉంటూ నిత్యం ప్రజా సమస్యలపై తక్షణం స్పందిస్తూ బీఆర్ఎస్ నేతలంతా చెమటోడ్చినప్పటికీ ఫలితాలు మాత్రం తారుమారు అయ్యాయి. ఉమ్మడి జిల్లాలో జుక్కల్ నియోజకవర్గంలో విజయం వరించినట్లే వచ్చి చేజారింది. కేవలం 11వందల ఓట్ల తేడాతో హన్మంత్ షిండే ఓటమి చెందారు. మొత్తం 19 రౌండ్ల ఫలితాల్లో సగానికి ఎక్కువ రౌండ్లలో ఏకపక్షంగా బీఆర్ఎస్‌కే లీడ్ దక్కింది. అనుహ్యంగా 15వ రౌండ్ తర్వాత లీడ్ తగ్గుతూ కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపింది. చివరాఖరకు జుక్కల్ స్థానం కాంగ్రెస్ పార్టీకి దక్కింది.

**బాల్కొండ, బాన్సువాడలో...**

ప్రభుత్వంలో కీలక భూమిక పోషించిన రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, స్పీకర్‌గా విధులు నిర్వహించిన పోచారం శ్రీనివాస రెడ్డి విజయం సాధించారు. కామారెడ్డి జిల్లాలో బాన్సువాడ నియోజకవర్గం నుంచి పోచారం శ్రీనివాస రెడ్డి భారీ మెజార్టీతో గెలిచారు. సమీప ప్రత్యర్థి ఏనుగు రవీందర్ రెడ్డిపై అఖండ విజయాన్ని పోచారం నమోదు చేశారు. బాల్కొండలోనూ వేముల ప్రశాంత్ రెడ్డి సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సునీల్ రెడ్డిపై విజయం సాధించారు. రెండు జిల్లాల్లో 9 నియోజకవర్గాలుంటే ఒక్కో జిల్లాలో బీఆర్ఎస్‌కు ఒక్కో అసెంబ్లీ స్థానం దక్కింది. ఇకపోతే ఇప్పటి వరకు బోణి కొట్టలేని బీజేపీ అనూహ్యంగా 3 స్థానాలు కైవసం చేసుకున్నది. నిజామాబాద్ అర్బన్‌లో ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్‌లో పైడి రాకేశ్ రెడ్డి, కామారెడ్డి నుంచి కాటిపల్లి వెంకట రమణారెడ్డి విజయం సాధించారు. వీరంతా అసెంబ్లీకి కొత్తగా ఎన్నికైన వారే కావడం విశేషం. కాంగ్రెస్ పార్టీ నుంచి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో డాక్టర్ భూపతి రెడ్డి విజ యం సాధించారు. బోధన్‌లో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి స్వల్ప ఓట్లతో గెలిచారు. జుక్కల్‌లో కాంగ్రెస్ పార్టీ కి చెందిన లక్ష్మీ కాంతారావు, ఎల్లారెడ్డి నుంచి మదన్ మోహన్ రావు విజయం కైవసం చేసుకున్నారు.

**అసెంబ్లీకి ఆరుగురు కొత్తవారు...**

అసెంబ్లీ ఫలితాల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి మొత్తం ఆరుగురు కొత్త వారు ఎమ్మెల్యేలుగా గెలిచారు. బీజేపీ నుంచి గెలిచిన ముగ్గురు ఎమ్మెల్యేలు సైతం తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు. కాంగ్రెస్ నుంచి నలుగురు గెలిచినప్పటికీ ఇందులో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి మినహా మిగిలిన ముగ్గురు అసెంబ్లీకి కొత్తే. ఇందులో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన తొలిసారి విజయం సాధించిన వారిలో ఆర్మూర్ నుంచి పైడి రాకేశ్ రెడ్డి, జుక్కల్ నుంచి లక్ష్మీ కాంతారావు ఉన్నారు. పలు దఫాలుగా అసెంబ్లీ బరిలో తలపడి తొలిసారి విజయాన్ని దక్కించుకున్న వారిలో నిజామాబాద్ అర్బన్ నుంచి ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, నిజామాబాద్ రూరల్ నుంచి భూపతి రెడ్డి, ఎల్లారెడ్డి నుంచి మదన్ మోహన్ రావు, కామారెడ్డి నుంచి కాటిపల్లి వెంకట రమణా రెడ్డి ఉన్నారు. గెలుపొందిన అభ్యర్థులను వారి అభిమానులు, పార్టీ శ్రేణులంతా పెద్ద ఎత్తున అభినందనల్లో ముంచెత్తారు. మరోవైపు ఆయా చోట్ల భారీ ఊరేగింపులు నిర్వహించారు. విజయాన్ని పెద్ద ఎత్తున బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన శ్రేణులంతా ఆయా నియోజకవర్గాల్లో సెలబ్రేట్ చేసుకున్నారు.

**స్పీకర్ సంచలన విజయం...**

బాన్సువాడ నియోజకవర్గం నుంచి ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పోచారం శ్రీనివాసరెడ్డి ప్రజా నాయకుడిగా చిరస్థాయి గుర్తింపును సాధించుకున్నారు. ఎన్ని రాజకీయ పదవులు అనుభవించినప్పటికీ పోచారం శ్రీనివాసరెడ్డి మాత్రం ఎప్పుడూ తన నియోజకవర్గ ప్రజలను వదిలి వెళ్లేది కాదు. వారంలో సగానికి ఎక్కువ రోజులు ఇక్కడే నియోజకవర్గ ప్రజలతో మమేకమై ఉండడం పోచారం శ్రీనివాస రెడ్డికే చెల్లింది. వ్యవసాయ మంత్రిగా, స్పీకర్‌గా తెలంగాణ రాష్ట్రంలో కీలక పదవులు అనుభవించిన ఆయన కేసీఆర్ ప్రభుత్వంలో ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నారు. వ్యవసాయ మంత్రిగా ప్రత్యేక గుర్తింపును పొందారు. రైతు బీమా, రైతుబంధు వంటి పథకాల రూపకల్పనలో సీఎం కేసీఆర్‌తో పాటు మేథోమథన చర్చల్లోనూ పాల్గొని ఏకంగా లక్ష్మీపుత్రుడిగా కేసీఆర్ ద్వారా పేరొందారు. కేసీఆర్ సహకారంతో బీఆర్ఎస్ ప్రభుత్వంలో బాన్సువాడ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దారు. ఏకంగా 10వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశారు. చిన్నపాటి గ్రామాన్ని మున్సిపాలిటీగా మార్చి బాన్సువాడ పట్టణాన్ని అభివృద్ధికి కేరాఫ్‌గా మార్చారు. అంతే కాకుండా నియోజకవర్గంలో 11వేల డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించారు. ఇందులో 10వేల ఇండ్లను పేదలకు పంపిణీ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములను నిర్మించి గిరిజనుల కోసం సాగు నీటి సమస్యను తీర్చే ప్రయత్నం చేశారు. ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ పగలు, రాత్రి తేడా లేకుండా పని చేయడం పోచారం శ్రీనివాస రెడ్డికి అలవాటు. ప్రజలతో కలిసి మెలిసి ఉండడం, ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడం ద్వారా పోచారం శ్రీనివాస రెడ్డి అద్భుతమైన విజయాన్ని కైవసం చేసుకొని రికార్డును తిరగరాశారు.

## ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎన్నికల ఫలితాలు

| నియోజకవర్గం | విజేత | పార్టీ | వచ్చిన ఓట్లు | మెజార్టీ | సమీప ప్రత్యర్థి | పార్టీ | వచ్చిన ఓట్లు |
|---|---|---|---|---|---|---|---|
| ఆర్మూర్ | పైడి రాకేశ్‌రెడ్డి | బీజేపీ | 72,654 | 29,670 | పి.వినయ్‌కుమార్‌రెడ్డి | కాంగ్రెస్ | 42,984 |
| బాల్కొండ | వేముల ప్రశాంత్‌రెడ్డి | బీఆర్ఎస్ | 70,417 | 4,533 | ఎం.సునీల్‌కుమార్ | కాంగ్రెస్ | 65,884 |
| బాన్సువాడ | పోచారం శ్రీనివాసరెడ్డి | బీఆర్ఎస్ | 76,278 | 23,464 | ఏనుగు రవీందర్‌రెడ్డి | కాంగ్రెస్ | 52,814 |
| బోధన్ | పి.సుదర్శన్‌రెడ్డి | కాంగ్రెస్ | 66,963 | 3,062 | ఎండీ షకీల్ | బీఆర్ఎస్ | 63,901 |
| జుక్కల్ | టి.లక్ష్మీకాంతరావు | కాంగ్రెస్ | 64,489 | 1,152 | హన్మంత్‌షిండే | బీఆర్ఎస్ | 63,387 |
| కామారెడ్డి | కె.వెంకటరమణారెడ్డి | బీజేపీ | 66,652 | 6,741 | కేసీఆర్ | బీఆర్ఎస్ | 59,911 |
| నిజామాబాద్‌రూరల్ | ఆర్.భూపతిరెడ్డి | కాంగ్రెస్ | 77,723 | 21,621 | బాజిరెడ్డి గోవర్ధన్ | బీఆర్ఎస్ | 56,102 |
| నిజామాబాద్‌అర్బన్ | డి.సూర్యనారాయణగుప్తా | బీజేపీ | 73,724 | 14,620 | షబ్బీర్‌అలీ | కాంగ్రెస్ | 59,104 |
| ఎల్లారెడ్డి | మదన్‌మోహన్‌రావు | కాంగ్రెస్ | 86,275 | 23,621 | జాజాల సురేందర్ | బీఆర్ఎస్ | 62,655 |

# వేముల ప్రశాంత్ రెడ్డి హ్యాట్రిక్ గెలుపు


విజయ చిహ్నం చూపుతున్న వేముల ప్రశాంత్‌రెడ్డి

- కాంగ్రెస్ హవాలోనూ ఘన విజయం
- బాల్కొండలో గ్రామ గ్రామాన బీఆర్ఎస్ సంబురాలు

కమ్మర్‌పల్లి. డిసెంబర్ 3 : వేముల ప్రశాంత్‌రెడ్డి బాల్కొండ ఎమ్మెల్యేగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌కుమార్‌పై 4,533 ఓట్ల మెజారిటీ సాధించారు. 2014, 2018 ఎన్నికల్లో జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన ప్రశాంత్ రెడ్డి.. బాల్కొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. కేసీఆర్‌కు అత్యంత విశ్వసనీయుడిగా ఎదిగి ఆయన సహకారంతో నియోజక వర్గాన్ని కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేశారు. అభివృద్ధికి మారు పేరుగా బాల్కొండ నియోజక వర్గాన్ని తీర్చిదిద్ది మూడోసారి ఘన విజయం సాధించారు. మొత్తం 70,417 వేల ఓట్లు సాధించి తన సమీప అభ్యర్థిపై విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్‌కు 65,884 ఓట్లు, బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మకు 30,250 ఓట్లు వచ్చాయి.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, PEDDHAKAPU CHINNA RAJESHWAR H.No.6-57, Perkit, Armoor, (D) Nzb. Changed my Surname/Name as PEDDAKAPU RAJESHWER, S/o. PEDDAKAPU RAJA GANGARAM
NTZ-0000

**WANTED**

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్దులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-314353

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్ : 91827 77590

**WANTED**

★రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.